సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 4 । జూలై । 2023



'ఆరోగ్య మహిళ' భేష్
ఆరోగ్య మహిళ పథకం స్త్రీలకు వరంగా మారింది. జిల్లాలో ఇప్పటివరకు 7,107 మంది పరీక్ష చేయించుకున్నారు.

8లో



ప్లాంటేషన్ నరికివేత
జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధి పాపకొల్లులో ప్లాంటేషన్‌ను కొందరు అక్రమంగా నరికిన ఘటన చోటుచేసుకుంది.

8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం



యాగశాలలో పూజలు చేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించారు. మేళతాళాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను యాగశాలకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మండపారాధన, గణపతిపూజ, హోమం అనంతరం చివరకు పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. హోమంలో పాల్గొన్న 16 మంది భక్త దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలోఅర్చకులు రవికుమార్ శర్మ, ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు చింత నాగరాజు, ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, చందుపట్ల శ్రీనివాస రెడ్డి, గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన 'ఎన్‌క్వాస్'



సిబ్బందితో మాట్లాడుతున్న బృందం సభ్యురాలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిని ఎన్‌క్వాస్ బృందం సోమవారం సందర్శించింది. ఢిల్లీకి చెందిన డాక్టర్ ఆర్‌కే పఠాని, భారతి(చెన్నై), గుణశీల(బెంగళూర్), ప్రతీక్ మోదీ(భోపాల్) ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డు, మెటర్నటీ థియేటర్, ఫార్మసీ, మార్చురీ, కిచెన్, ఇన్ పేషెంట్ విభాగాలను పరిశీలించారు. వీరు మూడు రోజుల పాటు ఇక్కడే ఉండి వైద్యశాలలోని వివిధ విభాగాలను తనిఖీ చేయనున్నారు. ఆస్పత్రిలోని కొన్ని విభాగాలు ఇటీవల లక్ష్య అవార్డుకు ఎంపిక కాగా, ఆపరేషన్ థియేటర్‌లోని లోపాల కారణంగా కొన్ని విభాగాలు అవార్డుకు దూరమయ్యాయి. దీంతో ఆపరేషన్ థియేటర్‌ను మరోసారి పరిశీలించాలని ఆస్పత్రి సిబ్బంది కోరడంతో బృందం సభ్యులు తనిఖీకి వచ్చారు. అయితే వీరిలో ఇద్దరు సభ్యులు.. నిబంధనలు కచ్చితంగా పాటించాలంటూ డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్‌ఎంఓ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో నేటి నుంచి ఆన్‌లైన్ సేవలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో మంగళవారం నుంచి ఆన్‌లైన్ సేవలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ నుంచి ఈ సేవలను భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఈఓ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో జరిగే సేవలు, పూజల వివరాలతో పాటు విరాళాలు అందజేసేవారు, ఇతర అవసరాల కోసం సంప్రదించాల్సిన నంబర్లతో కూడిన వెబ్‌సైట్‌ను రూపొందించిన విషయం తెలిసిందే.

వైద్యుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన 25 మంది వైద్యులను నియమించనున్నారు. ఈ మేరకు అర్హులైన వారు 7వ తేదీ సాయంత్రం లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆ తర్వాత 10, 11 తేదీల్లో జరిగే ఇంటర్వ్యూలకు దరఖాస్తు కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. కాగా, ఎంపికైన వారికి నెలకు రూ.1.25 లక్షల గౌరవ వేతనం చెల్లిస్తామని పేర్కొన్నారు. వివరాలకు www.scclmines.com వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ ఏడు స్థాయీ సంఘాల ప్రత్యేక సమావేశం బుధవారం ఉదయం 10 గంటల నుంచి జెడ్పీ హాల్‌లో నిర్వహించనున్నట్లు సీఈఓ విద్యాలత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

దమ్మక్కకు స్మృత్యంజలి

- భద్రాద్రిలో గిరిజనుల ఆధ్వర్యాన వైభవంగా సేవాయాత్ర
- అలరించిన నగర సంకీర్తన
- రామయ్యకు పూలు, పండ్లు సమర్పించిన ఆదివాసీలు
- ఘనంగా గోవిందరాజస్వామి కల్యాణం



రామయ్యకు పూలు, పండ్లు సమర్పిస్తున్న గిరిజనులు

భద్రాచలం: భద్రగిరి క్షేత్రంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని పూజించిన ఆధ్యురాలు, రామయ్యకు అపర భక్తురాలు అయిన పోకల దమ్మక్క సేవా యాత్ర ఘనంగా నిర్వహించారు. ఆషాఢ పౌర్ణమి రోజున భద్రాచలం పుణ్యక్షేత్రంలో పోకల దమ్మక్కను స్మరిస్తూ గిరిజనుల ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహించటం 2014 నుంచి ఆనవాయితీగా వస్తోంది. సోమవారం ఆషాఢ పూర్ణిమ కావడంతో వివిధ గ్రామాల నుంచి గిరిజనులను ప్రత్యేక బస్సుల్లో భద్రగిరికి తీసుకొచ్చారు. ఉత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని పొగడ చెట్టు వద్ద గల దమ్మక్క విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, కోలాటాలు, గిరిజనుల సంప్రదాయ నృత్యాల నడుమ చప్టా దిగువన ఉన్న భక్త రామదాసు విగ్రహం వద్ద, సీతారామ ఆఫీసర్స్ క్లబ్ వద్ద ఉన్న శబరి విగ్రహం వద్ద అర్చకులు పూజలు నిర్వహించి, పూలు, పండ్లు సమర్పించారు. రామదాసు కీర్తనలతో నగర సంకీర్తన చేశారు. అనంతరం దేవస్థానంలో రామయ్యకు దమ్మక్క తరఫున పలు రకాల పూలు, ఫలాలను వివిధ గ్రామాల నుంచి తీసుకొచ్చిన గిరిజనులు అందజేశారు. ఈ సందర్భంగా రామయ్యకు ప్రత్యేక పూజలు, నిత్యకల్యాణ వేడుకలను వైభవోపేతంగా జరిపారు.



కొమ్ము పాగాతో ఈఓ రమాదేవి



బేడా మండపంలో గిరిజనుల రేలా నృత్యం



గిరిజనులకు వస్త్రాలు, పండ్లు అందజేస్తున్న ఈఓ, అర్చకులు విజయరాఘవన్

రామయ్యకు అపర భక్తురాలు..

శ్రీరాముడికి దమ్మక్క అపర భక్తురాలని దేవస్థానం ఈఓ రమాదేవి అన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ.. అలాంటి దమ్మక్కను స్మరించుకోవడం, సేవా యాత్ర నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గిరిజనులను ఈ సేవాయాత్రలో భాగస్వాములను చేయడం కనీస ధర్మమని, అందుకే వివిధ గ్రామాల నుంచి గిరిజనులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల ద్వారా తరలించామని తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ రేలా, కొమ్ము నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ పూజల్లో ఆలయ ప్రధానార్చకులు అమరవాది విజయరాఘవన్, అర్చకులు, వేదపండితులు, సీసీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా గోవిందరాజ స్వామి కల్యాణం..

శ్రీసీతారామచంద్రస్వామి వారి అనుబంధ ఆలయమైన తాతగుడి సెంటర్‌లో వేంచేసియున్న గోవిందరాజ స్వామి వారి తిరుకల్యాణోత్సవం సోమవారం వైభవోపేతంగా జరిగింది. శ్రీదేవి - భూదేవి సమేత గోవిందరాజ స్వామి వారికి దేవస్థానం తరఫున ఈఓ రమాదేవి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అర్చకులు కల్యాణోత్సవ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కాగా, అంతకుముందు ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుకను వైభవోపేతంగా జరిపించారు. స్వామివారి మూలమూర్తులను ముత్తంగి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి నిత్యకల్యాణంలో సైతం గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

'వాణి' వినిపించేదెలా ?

గ్రీవెన్స్‌లో ఫిర్యాదుదారులకు ఇబ్బందులు



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌కు ఫిర్యాదుదారులు పోటెత్తారు. పురుషుల కంటే మహిళలే అధికంగా వచ్చి వినతులు అందించగా, కొన్ని సమస్యలను కలెక్టర్ అనుదీప్ వీడియో కాల్ ద్వారా సంబంధిత మండలాల అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. మరికొన్ని సమస్యలకు సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిర్యాదుదారులు వినతులు ఇచ్చే హాల్‌లోకి రావడానికి పోటీపడ్డారు. అందరినీ ఒకేసారి అనుమతించడంతో తోపులాట చేసుకుంటోంది. గతంలో ఇద్దరు లేదా ముగ్గురిని మాత్రమే హాలులోకి అనుమతించే వారు. తాజాగా నూతన కలెక్టరేట్‌లో ఆ పరిస్థితి లేకపోవడంతో తరచూ వచ్చేవారు ఎక్కువ సంఖ్యలో ప్రజలను తీసుకొచ్చి వారి వద్ద తమ పరపతి పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో సమస్యలపై దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చేవారికి ఇబ్బంది కలుగుతోంది. పైగా దరఖాస్తులు అందజేసేపుడు సమూహాలను తీసుకొచ్చే కొందరు నాయకులు ఫొటోలు తీయించుకుంటూ ఉండడంతో ఆ హాల్‌లో ప్రశాంతత కరువవుతోంది. అధికారులు దీనిపై దృష్టి సారిస్తే నిజంగా సమస్యలతో బాధపడే వారు కలెక్టర్‌కు దరఖాస్తులు అందజేసి తమ సమస్యలను వివరించే వీలుంటుందని ఫిర్యాదుదారులు అంటున్నారు.

ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

- అశ్వారావుపేట మండలం కోయరంగాపురం గ్రామసర్పంచ్ గోవింద్. తమ పంచాయితీ పరిధిలోని గుంటిమడుగు, మేకలబండ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను మంజూరు చేయాలని కలెక్టర్‌కు దరఖాస్తు అందించగా తగు చర్యల నిమిత్తం జిల్లా మహిళా శిశు, సంక్షేమాధికారికి ఎండార్స్ చేశారు.
- పాతకొత్తగూడేనికి చెందిన కుంపటి నాగరాజు, నిర్మల దంపతులు దళితబంధు మంజూరు చేయాలని, సూపర్ మార్కెట్ ఏర్పాటుతో ఉపాధి పొందుతామని చేసిన దరఖాస్తును ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి ఎండార్స్ చేశారు.

రెండు రోజుల్లో పట్టాల పంపిణీ పూర్తి చేయాలి

పోడు పట్టాల పంపిణీ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీలో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 50,595 మందికి పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కులవృత్తుల వారు రూ.లక్ష ఆర్థిక సాయం కోసం 13,657 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారని, వారి ఇళ్లకు వెళ్లి విచారణ పూర్తి చేయాలని ఎంపీడీఓలకు సూచించారు. రెండో విడత దళితబంధు యూనిట్లు ఒక్కో నియోజకవర్గానికి 1100 రానున్నాయని తెలిపారు. ధరణిలో నూతనంగా చేర్చిన అంశాలపై అధికారులకు అవగాహన ఉండాలన్నారు.

ప్రాధాన్యతా అంశాలను పూర్తిచేయాలి...

ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎస్ శాంతికుమారి అన్నారు. సోమవారం ఆమె హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో హరితహారం, సీఎంఆర్ రైస్, బీసీ కుల వృత్తులకు ఆర్థిక సాయం, రెండో విడత గొర్రెల పంపిణీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై చేపడుతున్న చర్యలను కలెక్టర్ అనుదీప్ వివరించారు.

రేపటి నుంచి 'ఇన్‌స్పైర్' వర్క్‌షాప్‌లు

కొత్తగూడెంఅర్బన్: ఇన్‌స్పైర్ మనాక్, ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమాలపై ఉపాధ్యాయులకు ఈనెల 5 నుంచి డివిజన్ల వారీగా వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.సోమశేఖరశర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన చేశారు. ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గణితం, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్ ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల నుంచి ప్రాజెక్టులు రూపొందించాలని ఆదేశించారు. 5వ తేదీన పాల్వంచ, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల వారికి పాల్వంచలో, 6వ తేదీన జూలూరుపాడు, చంద్రుగొండ, కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల వారికి కొత్తగూడెం సింగరేణి పాఠశాలలో, 7వ తేదీన గుండాల, ఇల్లెందు, ఆళ్లపల్లి, టేకులపల్లి మండలాల వారికి ఇల్లెందు సింగరేణి పాఠశాలలో, 10వ తేదీన చర్ల, భద్రాచలం, దుమ్ముగూడెం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, కరకగూడెం, పినపాక మండలాల వారికి భద్రాచలంలో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు వివరించారు.

బాలికల హాస్టల్‌లో కన్నీటి రోదన

- నీరులేక ఇబ్బంది పడుతున్న సాంఘిక సంక్షేమ విద్యార్థినులు
- దుర్వాసన వెదజల్లుతున్న గదులు
- ఉండలేకపోతున్నామని తల్లిదండ్రులకు సమాచారం



పాల్వంచలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల హాస్టల్

పాల్వంచ: పట్టణంలోని నవభారత్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో నీరు లేక విద్యార్థినులు అల్లాడుతున్నారు. బోర్ల నుంచి నీరు రాకపోవడం, అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో తాగునీటితో పాటు కాలకృత్యాలు, స్నానాలు, ఇతర అవసరాలకు నీరు లేక విలవిల్లాడుతున్నారు. సుమారు 200 మంది విద్యార్థినులు చదువుతున్న ఈ కళాశాలలో రెండు బోర్లు ఉన్నప్పటికీ నీళ్లు అంతంతమాత్రంగానే వస్తున్నాయి. ఇందులో ఒక బోరు మోటార్ చెడిపోయింది. మరో బోరు నుంచి ఆర్‌ఓఆర్ ప్లాంట్‌కు సరిపడా నీరందడం లేదు. అదికూడా మొదటి అంతస్తుకు మాత్రమే వస్తుండగా, సెకండ్ ఫ్లోర్‌లో ఉన్నవారిని చుక్కనీరు కూడా రావడం లేదు. సరిగా శుభ్రం చేయకపోవడంతో గదులు సైతం దుర్వాసన వస్తున్నాయని విద్యార్థినులు చెబుతున్నారు. కనీస అవసరాలకు కూడా నీరు రావడం లేదని, హాస్టల్‌లో ఉండలేకపోతున్నామని, వెంటనే ఇంటికి తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు సమాచారం అందిస్తున్నారు. ఇక భోజనం సైతం దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. గత మార్చిలో హాస్టల్‌కు పౌష్టికాహార బియ్యం రాగా, వేసవి సెలవుల తర్వాత కూడా అవే వండుతున్నారని, నాలుగు నెలలు కావడంతో బియ్యం ముక్కిపోవడంతో పాటు పురుగులు పట్టాయని, ఆ భోజనం తినలేకపోతున్నామని బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ శాంతకుమారిని వివరణ కోరగా.. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీళ్లు రావడం లేదని, బయటి నుంచి 20 క్యాన్‌లలో తెప్పించామని తెలిపారు. మరో మోటార్‌ను మరమ్మతు చేయిస్తామన్నారు. మిషన్ భగీరథ నీరందించాలని ఇంట్రా విలేజ్ అధికారులను కోరినా పట్టించుకోలేదని చెప్పారు. బియ్యం రీప్లేస్‌మెంట్ చేయాలని గ్రీవెన్స్‌డేలో అధికారులను కోరామన్నారు. దీనిపై జిల్లా సహకార అధికారి వెంకటేశ్వర్లును వివరణ కోరగా సమస్య తన దృష్టికి రాలేదని, తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దుర్గమ్మ సన్నిధిలో భట్టి..

మధిర: సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క దంపతులు సోమవారం విజయవాడలోని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. భట్టి చేపట్టిన పాదయాత్ర ఆదివారం పూర్తి కావడంతో వారు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు.

బోధకులేరి ?



- ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన ప్రవేశాలు
- విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా లేని ఉపాధ్యాయులు
- గతేడాది 'పది' ఫలితాల్లో తగ్గిన ఉత్తీర్ణత
- విద్యావలంటీర్లను పునరుద్ధరిస్తే మేలంటున్న తల్లిదండ్రులు

కొత్తగూడెంఅర్బన్ : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడడంతో విద్యార్థుల అడ్మిషన్లు గతేడాది కంటే గణనీయంగా పెరిగాయి. జూన్ 1 నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం ద్వారా ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం సత్ఫలితాలిచ్చింది. అయితే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా లేక ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు నెలకొన్నాయి. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు గతేడాది ప్రారంభించినా కోర్టులో కేసు నడుస్తుండడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అది పూర్తయితే ఏర్పడిన ఖాళీల స్థానాలకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయడమో, లేదంటే విద్యావలంటీర్లను నియమించడమో ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకునేది. కానీ ఇప్పుడలాంటి చర్యలేవీ చేపట్టకపోవడంతో పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడింది. ఈ ప్రభావం పదో తరగతి ఫలితాలపై పడుతోంది. 2022 - 23లో 78.53 శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలో 29వ స్థానంలో నిలవడం గమనార్హం.

వలంటీర్లను పునరుద్ధరించాలి..

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిపడా లేని చోట విద్యావలంటీర్లతో తరగతులు నిర్వహించారు. అయితే కరోనాతో బడులు మూతపడిన సమయంలో వారిని తొలగించారు. ఆ తర్వాత కొన్ని రోజులు ఆన్‌లైన్ క్లాసులు చేపట్టారు. అనంతరం పాఠశాలలను రెగ్యులర్‌గా నడిపిస్తున్నప్పటికీ.. వలంటీర్లను తిరిగి తీసుకోలేదు. ప్రస్తుతం జిల్లాలో ఉపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న నేపథ్యంలో విద్యా వలంటీర్ల అవసరం ఉందని, వారిని తిరిగి నియమిస్తే బోధన మెరుగయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కరోనాకు ముందు జిల్లాలో 574 మంది విద్యావలంటీర్లు పని చేయగా, వారి వేతనాలు సైతం పూర్తిగా చెల్లించలేదు. రూ.1.48 కోట్ల మేర చెల్లించాల్సి ఉండగా, వాటి కోసం ఇప్పటికీ హైదరాబాద్‌లోని ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తిరిగి ఈ ఏడాది విద్యావలంటీర్లను విధుల్లోకి తీసుకుంటారని ప్రచారం జరిగినా.. ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో నిరుత్సాహానికి లోనవుతున్నారు.

జిల్లాలో ఖాళీలు ఇలా..

జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో కలిపి బోధన, బోధనేతర సిబ్బంది 4,357 మంది ఉండాలి. కానీ ప్రస్తుతం 3,661 మంది మాత్రమే పని చేస్తుండగా 696 ఖాళీలున్నాయి. ఖాళీ పోస్టుల స్థానంలో విద్యావలంటీర్లను పునరుద్ధరిస్తే విద్యా ప్రమాణాలు పెరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది కొత్తగా 7,501 మంది విద్యార్థులు చేరారు. సర్కారు స్కూళ్లలో సౌకర్యాలు, మన ఊరు -మన బడి కార్యక్రమంలో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం, ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ బోధన, మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం, యూనిఫాం మోడల్ మార్పు, లైబ్రరీల ఏర్పాటు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ.. ఇలా రకరకాల కారణాలతో అడ్మిషన్లు గణనీయంగా పెరుగుతున్నా.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బోధన సిబ్బంది లేక ఇబ్బందులు తప్పవని తల్లిదండ్రులు అంటున్నారు.

విద్యావలంటీర్లను పునరుద్ధరించాలి



కరోనా సమయంలో మమ్మల్ని తొలగించారు. నాటి నుంచి తిరిగి విధుల్లోకి తీసుకోలేదు. ప్రస్తుతం పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఈ విషయంలో సర్కారు పునరాలోచించి విద్యావలంటీర్లను పునరుద్ధరించాలి.

– భూక్యా కుమార్‌లాల్, వీవీల సంఘం జిల్లా అధ్యక్షుడు

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



రాష్ట్ర వ్యాప్తంగా విద్యావలంటీర్ల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి కోసం హైదరాబాద్ చుట్టూ తిరిగి ఇబ్బంది పడ్డాం. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్నాం.

– కె.భావన, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు

ఉపాధ్యాయుల సర్దుబాటు జరుగుతోంది



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నాం. విద్యార్థులు ఎక్కువగా ఉన్న స్కూళ్లకు ఇతర పాఠశాలల నుంచి పంపించి బోధన చేయిస్తున్నాం. ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య జిల్లాలో ఎక్కువగానే ఉంది.

– ఇ.సోమశేఖరశర్మ, డీఈఓ

సిబ్బంది సహకారం మరువలేనిది..

- 'సాక్షి'తో ఎస్పీ వినీత్
- బాధ్యతలు చేపట్టి నేటికి ఏడాది



డాక్టర్ వినీత్, ఎస్పీ

కొత్తగూడెంటౌన్: పోలీస్ సిబ్బందితో పాటు ఇతర అధికారుల సహకారంతో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశామని ఎస్పీ వినీత్ అన్నారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టి మంగళవారానికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 2017 బ్యాచ్‌కు చెందిన తాను మొదట భద్రాచలం ఏఎస్పీగా పని చేశానని, 2021లో నిజామాబాద్‌కు బదిలీ అయి, తిరిగి 2022లో జిల్లాకు అడిషనల్ ఎస్పీ (ఓఎస్‌డీ)గా వచ్చానని తెలిపారు. నాటి ఎస్పీ సునీల్‌దత్ బదిలీతో గతేడాది జూలై 4న ఎస్పీగా బాధ్యతలను స్వీకరించానని చెప్పారు. ఆ వెంటనే వచ్చిన గోదావరి వరదల సమయంలో ముంపు బాధితులను రక్షించేందుకు తమ సిబ్బందితో పాటు ఇతర శాఖల అధికారుల సహకారంతో చేసిన కృషి సంతృప్తినిచ్చిందని చెప్పారు. ఇక రాష్ట్రపతి, సీఎం పర్యటన, భద్రాచలంలో శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాల సందర్భంగా పలువురు ప్రముఖులు వచ్చినప్పుడు సమర్థంగా విధులు నిర్వర్తించి అన్ని వర్గాల ప్రజల మన్ననలు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న 200 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చి, వారిని పోటీ పరీక్షలకు సిద్ధం చేశామని అన్నారు. ముఖ్యంగా మావోయిస్టుల చర్యలను అరికట్టడంతో పాటు ప్రభావిత ప్రాంతాల ప్రజలను చైతన్యం చేసి మావోయిస్టు పార్టీకి దూరంగా ఉంచేందుకు కృషి చేశామని చెప్పారు. 2022 జూలై నుంచి గత జూన్ వరకు జిల్లాలో మొత్తం 88 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఏడాది కాలంగా విధి నిర్వహణలో తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

క్లుప్తంగా

మలేరియా నివారణకు కృషి చేయాలి



దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న అధికారులు

టేకులపల్లి: ఏజెన్సీ గ్రామాల్లో మలేరియా నివారణకు అందరూ కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ స్పందన, జిల్లా సహాయ అధికారి గొంది వెంకటేశ్వర్లు సూచించారు. మలేరియా తీవ్రత అధికంగా ఉన్న గ్రామాల్లో గృహం లోపల ఆల్ఫా సైపర్ మిత్రిన్ రసాయన మందు పిచికారీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. మొదటి విడతగా జరుగుతున్న ఈ కార్యక్రమం అమలు తీరును సోమవారం పరిశీలించారు. సంపత్ నగర్ ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని సిద్ధారం గ్రామంలో రసాయన మందు పిచికారీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన మందు ఇంటి లోపల సంపూర్ణంగా పిచికారీ చేస్తే మూడు నెలల పాటు దోమలు, కీటకాలను నివారించవచ్చని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పోరండ్ల శ్రీనివాస్, ధనసరి రాంబాబు, మానస, సుశీల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జేకే–5 ఓసీని సందర్శించిన డైరెక్టర్



ఓసీలో పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అధికారులు

ఇల్లెందు: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలోని జేకే–5 ఉపరితల గనిని డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) వెంకటేశ్వరరెడ్డి సోమవారం సందర్శించారు. రోజువారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన చర్యలు, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, ఓబీ లోడింగ్ పనులపై జీఎం జాన్ ఆనంద్‌తో చర్చించారు. అనంతరం జీఎం కార్యాలయంలో అధికారులతో సమావేశమై వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, మల్లారపు మల్లయ్య, బాలాజీనాయుడు, పూర్ణచందర్, శివప్రసాద్, నాగేశ్వరరావు, మహేష్, శివకుమార్, వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు రద్దు చేయాలి

మంత్రి సత్యవతి రాథోడ్‌కు విన్నపం



మంత్రి సత్యవతికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: ఐటీడీఏలో జరిగిన గుడ్లు, మాంసాహార టెండర్లను గిరిజనేతరులకు కట్టబెట్టి ఆదివాసీ, గిరిజనులను మోసం చేస్తున్నారని సేవాలాల్ సేన జిల్లా ఇన్‌చార్జి మాళోతు శివ నాయక్ పేర్కొన్నారు. సోమవారం మహబూబాబాద్‌లో మంత్రి సత్యవతి రాథోడ్‌ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ డీడీ డేవిడ్‌రాజ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఏటీడీఓ చంద్రమోహన్ కూడా గిరిజనేతరులకు ప్రాధాన్యత ఇస్తున్నారని, టెండర్లలో కాంట్రాక్టర్ల వద్ద, వార్డెన్ల వద్ద కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. హాస్టళ్లలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని తెలిపారు. ఇద్దరు అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలని, గిరిజనేతరుల టెండర్లు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నేత ధరావత్ నాగేంద్ర, రాందాస్, అనిల్, విజయ్, గణేష్ పాల్గొన్నారు.

స్వగ్రామంలో 'నైటింగేల్'కు సన్మానం



సుశీల దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

రఘునాథపాలెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంకు చెందిన తేజావత్ సుశీల ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా ఆమెకు సోమవారం వీ.వీ.పాలెం పాఠశాలలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ రావెళ్ల మాధవి, ఎంపీటీసీలు యరగర్ల హన్మంతరావు, భద్రమ్మతోపాటు పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పోతగాని నాగరాజు, హెచ్ఎం శ్రీదేవి, కిలారు వెంకటరమణ పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

'ఆరోగ్య మహిళ'తో మెరుగైన వైద్యం

- ప్రతీ మంగళవారం ఉమెన్స్ క్లినిక్ సేవలు
- జిల్లాలో ఐదు ఆస్పత్రుల్లో ఎనిమిది రకాల వ్యాధులకు చికిత్స
- ఇప్పటివరకు 7,107 మందికి పరీక్షలు



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ పథకం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులకు చెప్పుకోలేకనో, ఆర్థిక భారంతోనో, అవగాహన లేకనో కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇలాంటి వారికి ఈ కార్యక్రమం వరంగా మారింది. గత మార్చి 8 నుంచి జిల్లాలోని ఐదు పీహెచ్‌సీలు మోరంపల్లి బంజర పర్ణశాల, ఎర్రగుంట, పెనగడప, కొమరారంలలో ఆరోగ్య మహిళా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ మంగళవారం వైద్య సేవలందిస్తున్నారు. ఇప్పటివరకు 7,107 మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. ఇందులో 7 వేల మందికి పైగా మందికి అవసరమైన మందులు అందజేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని రిఫరల్ ఆస్పత్రి అయిన కొత్తగూడెం జిల్లా ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు.

ప్రాథమిక పరీక్షలు..

ఆరోగ్య మహిళా కేంద్రాల్లో 8 రకాల సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నారు. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, నెలసరి, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులపై పరీక్షలు చేసి వైద్యం అందజేస్తున్నారు. కేన్సర్ తదితర సంబంధిత సమస్యలపై ప్రాథమికంగా పరీక్షలు నిర్వహించి, జిల్లా కేంద్రంలోని రిఫరల్ ఆస్పత్రికి, హైదరాబాద్‌లోని పెద్దాస్పత్రులకు రిఫర్ చేస్తారు. ఒక కేన్సర్ కేసును గుర్తించి హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు.

నిర్వహించే పరీక్షలు ఇవే

ఆరోగ్య మహిళా కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. ఉమెన్స్ క్లీనిక్‌లలో రొమ్ము కేన్సర్, నోటి, గర్భాశయ కేన్సర్‌ను గుర్తించేందుకు ప్రాథమిక పరీక్షలు చేస్తారు. అండాశయ (పీసీఓడీ)వ్యాధులు, రుతుక్రమ, మోనోపాజ్ సమస్యలను గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారు. మూత్రనాళాల ఇన్ఫెక్షన్, పెల్విక్ ఇన్ఫ్లమేటరీ సమస్యలు, సూక్ష్మపోషక లోపాలు గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు చేస్తారు. ఇక్కడ నమూనాలను సేకరించి జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని డయాగ్నస్టిక్ హబ్‌కు పంపించి పరీక్షలు చేస్తారు. రిఫరల్ ఆస్పత్రికి వచ్చిన కేసుల్లో మమ్మోగ్రామ్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, కల్పోస్కోపీ పాప్స్మర్/బయాప్సీ తదితర వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు.

మహిళలకు ప్రత్యేక వైద్యం



మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఆరోగ్య మహిళా కేంద్రాలను సంప్రదించాలి. ఉమెన్స్ క్లీనికలలో కేన్సర్ నిర్ధారణ, గర్భాశయ సమస్యలు, మూత్రనాళ సమస్యలను గుర్తించేందుకు వైద్య పరీక్షలు చేస్తున్నాం. సంతానం కలగని వారికోసం ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తాం. పోషకాల లోపాలను నిర్ధారణ చేసి మందులు ఇస్తున్నాం.

–డాక్టర్ లక్ష్మీశిరీష, డీఎంహెచ్ఓ

ఆరోగ్యానికి భరోసా..



ఆరోగ్య మహిళా కేంద్రాలు మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కేన్సర్ లాంటి వ్యాధులను సైతం నిర్ధారణ చేసి వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు పంపే అవకాశం కూడా ఉంది. ఈ క్రమంలో ఒక కేన్సర్ కేసును గుర్తించి హైదరాబాద్‌కు రిఫర్ చేశాం. వివిధ సమస్యలున్నా మహిళలకు ఆపరేషన్లు చేయించాం.

–డాక్టర్ మణికంఠ రెడ్డి, జిల్లా ఎన్‌సీడీ అధికారి

సారూ.. నా కొడుకులు కొడుతున్నారు

- కలెక్టర్ ఎదుట ఓ వృద్ధురాలి ఆవేదన
- కేసు నమోదు చేయించాలని తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశం



కలెక్టర్‌కు సమస్యను నివేదిస్తున్న వృద్ధురాలు మాణిక్యమ్మ

సూపర్‌బజార్(కొత్తగూడెం): తనకు, తన భర్తకు ఆరోగ్యం బాగోలేదని, కుంట భూమి విక్రయించి వైద్యం చేయించుకుందామంటే కొడుకులు కొడుతున్నారని ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఆళ్లపల్లికి చెందిన కామెర్ల మాణిక్యమ్మ ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్‌ను కలిసి కన్నీళ్ల పర్యంతమైంది. తమకు ఎకరం రెండు కుంటల భూమి ఉందని, కొడుకులు చూడటం లేదని, చికిత్స కోసం భూమ్మి అమ్మాలంటే పట్టా కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చించేశారని ఆవేదన వ్యక్తం చేసింది. తమకు కుమార్తె కూడా ఉందని, ఆమె భర్త మరణించడం వల్ల ఒంటరిదైందని, తమకు న్యాయం చేయాలని వేడుకొంది. స్పందించిన కలెక్టర్ ఆళ్లపల్లి తహసీల్దార్‌తో వీడియోకాల్ ద్వారా మాట్లాడి వృద్ధురాలి ఇద్దరు కుమారులపై పోలీస్ కేసు ఫైల్ చేయించడంతోపాటు వృద్ధ దంపతులకు రక్షణ కల్పించాలని, వారి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్



గిరిజన దర్బార్‌లో వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: ఐటీడీఏ ఆధ్వర్యాన ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల గిరిజనుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత యూనిట్ అధికారులకు అందచేశారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ గురుకులం, ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం గిరిజన దర్బార్‌లో వినతిపత్రాలను ఇవ్వొద్దని సూచించారు. అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సురేష్‌బాబు, అశోక్‌కుమార్, భాస్కరన్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బ్యాగులు, షూ, నోట్‌బుక్స్ సరఫరా చేయటానికి టెండర్లు ఖరారు చేశారు.

గిరివికాసం పాఠశాలలో ప్రత్యేక ఏర్పాట్లు

భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన వికాసం పాఠశాలలో బధిర విద్యార్థుల బోధన కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీఓ డేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం ఆయన ఆ పాఠశాలను సందర్శించి బధిర విద్యార్థులకు జరుగుతున్న బోధన, సౌకర్యాలపై ఆరా తీశారు. ఏటీడీఓ నర్సింగరావు, అధికారులు తానాజీ, డి.హరీష్, అరుణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

సమగ్ర శిక్షా కార్యక్రమం నియామకాల్లో కదలిక



అభ్యర్థితో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

కొత్తగూడెంఅర్బన్: 2019లో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష కార్యక్రమం ద్వారా వివిధ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు స్వీకరించింది. సంబంధిత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులను రోస్టర్ విధానంలో నియమించేందుకు సోమవారం బాబు క్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాధికారి ఇ.సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఖాళీగా ఉన్న సమ్మిళిత విద్యా రిసోర్స్‌పర్సన్లు, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, అసిస్టెంట్ ప్రోగ్రామిగ్ ఆఫీసర్ తదితర పోస్టులకు సంబంధించి అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు ఎస్‌కే.సైదులు, ఎన్.సతీష్ కుమార్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీజీఈ మాధవరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, రమాదేవి, ప్రకాష్ రావు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, మధుసూదన్‌రావు, ఆనందరావు, గాంధీ, శ్రీరామ్, టెక్నికల్ పర్సన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి

చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. సోమవారం బాబుక్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తనిఖీచేశారు. విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలను పరిశీలించారు. గణితం, తెలుగు, సాంఘికశాస్త్రాల్లో కొన్ని ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. చదువులో కొందరు వెనుకబడిఉన్నట్లుగా గుర్తించి, వారికి అదనంగా ఒక గంట ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు మధురవాణికి సూచించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్



ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అర్హత కలిగిన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు కట్టించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సోమవారం ప్రజాసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడ్లుతూ ఇంటిస్థలం ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ 5.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు కేటాయించకపోతే ప్రభుత్వ భూములను పేదలతో ఆక్రమిస్తామని హెచ్చరించారు. పోడువ్యవసాయం చేసుకుంటున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు కాసాని అయిలయ్య, అన్నవరపు కనకయ్య, మచ్చ వెంకటేశ్వర్లు, మందలపు జ్యోతి, హరికృష్ణ, ఎ.సత్యనారాయణ, కె.పుల్లయ్య, ఆర్.శ్రీనివాస్, చిరంజీవినాయుడు, నర్సారెడ్డి, వీరన్న, బి.లక్ష్మి, ఎస్.లక్ష్మి, నబీ, కె.శ్రీధర్, బి.రమేష్, డి.రవికుమార్, కె.వెంకటేశ్వర్లు, సత్య తదితరులు పాల్గొన్నారు.

పాపకొల్లులో ప్లాంటేషన్ నరికివేత



పోడు సాగుదారులతో మాట్లాడుతున్న పోలీస్, అటవీశాఖ అధికారులు

జూలూరుపాడు: జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధి పాపకొల్లు బీట్–బీలోని అటవీ ప్లాంటేషన్‌ను కొందరు వ్యక్తులు అక్రమంగా నరికిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పాపకొల్లు అటవీ బీట్–బీలో 2021వ సంవత్సరంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో 10 హెక్టార్ల విస్తీర్ణంలో ప్లాంటేషన్ వేశారు. భోజ్యాతండా గ్రామ పంచాయతీ వెనకతండాకు చెందిన పోడు సాగుదారులు ధరంసోత్ మోతీలాల్, ధరావత్ సేవియా, ధరావత్ వెంకటియా, ధరంసోత్ కామా, ధరంసోత్ ఇందు, ధరావత్ జ్యోతిలతోపాటు మరికొందరు కలిసి ప్లాంటేషన్‌లోకి ప్రవేశించి నరికారు. ఈ విషయం తెలుసుకున్న జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు, ఎస్సై పోటు గణేష్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని ప్లాంటేషన్ నరుకుతున్న పోడు సాగుదారులను అడ్డుకున్నారు. అప్పటికే ప్లాంటేషన్‌లోని రెండు ఎకరాల్లోని 1,200 మొక్కలను పోడు సాగుదారులు నరికివేశారు. ఈ క్రమంలో పోడు సాగుదారులకు, అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. సాగు చేసుకున్న పోడు భూములను ఒక్క కుంట కూడా వదలకుండా లాక్కోవడం వల్లే తమకు పట్టాలు పోయాయని పోడు సాగుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. తమతోపాటు పోడు సాగుచేసుకున్న వారందరికీ పట్టాలు వచ్చాయని, తాము సాగు చేసుకోవడానికి భూమి లేనందున ప్లాంటేషన్ కోసం తీసుకున్న భూమిని తిరిగి ఇవ్వాలని కోరారు. తమ జోలికి వస్తే పురుగుల మందు తాగి చనిపోతామంటూ అటవీ, పోలీస్ అధికారులను బెదిరించారు. ప్లాంటేషన్ నరికిన పోడు సాగుదారులను ఎస్సై పోటు గణేష్ అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ప్లాంటేషన్ నరికిన వ్యక్తులపై జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్ఓ శివాజీ గణేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కొల్లాపురం గ్రామంలో సోమవారం విద్యుదాఘాతానికి గురై చీమల భద్రయ్యకు చెందిన దుక్కిటెద్దు మృతిచెందింది. గ్రామ పొలిమేరలో గడ్డి మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరుకున్న ఎద్దు కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో ఈ ప్రమాదం జరిగింది. ఎద్దు విలువ రూ.50వేల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు. కాగా ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



మృతి చెందిన దుక్కిటెద్దు

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంఅర్బన్: 102 అమ్మఒడి అంబులెన్సులో డ్రైవర్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఈఎంఆర్ గ్రీన్ హెల్త్ సర్వీస్ జిల్లా ఈఎంఈ ఎ.దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, డ్రైవింగ్ లైసెన్స్, మూడేళ్ల ఏళ్ల అనుభవం కలిగిన 35 ఏళ్ల లోపువారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 5న భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని 108 కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాల కోసం 91210 03246 నంబరులో సంప్రదించాలని కోరారు.

కిన్నెరసాని పోస్టుమాస్టర్ మృతి



హైదర్(ఫైల్)

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసాని గ్రామంలో అనేక సంవత్సరాలుగా పోస్టు మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న హైదర్(50) సోమవారం పాల్వంచ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో తన ఇంటి వద్ద గుండెపోటుతో మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. హైదర్ మృతిపట్ల తపాలా శాఖ సిబ్బంది, ఉద్యోగులు సంతాపం తెలిపారు.

పోడు సాగుదారులపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

- సక్రమంగా జరగని సర్వే.. పాస్‌బుక్‌కు వసూళ్లు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పోడు సాగుదారులకు పట్టాలు పంపిణీ చేయడాన్ని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా స్వాగతిస్తున్నా... పోడు సాగుదారుల గుర్తింపు, అర్హులకు పట్టాల పంపిణీలో మాత్రం ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేస్తోందని విమర్శించారు. అన్నిచోట్ల పూర్తి స్థాయిలో సర్వే చేయకపోగా, చేసిన చోట్ల కూడా మూడు, నాలుగెకరాలకు బదులు ఎకరానికే పట్టా ఇస్తున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో 13 వేల మంది పోడు సాగుదారులకు గాను ఆరు వేల మందికే పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారన్నారు. ఇక పట్టాల పేరిట పోడు సాగుదారుల నుంచి బీఆర్ఎస్ నాయకులతో పాటు ఐటీడీఏ, అటవీ శాఖ అధికారులు డబ్బు వసూలు చేస్తున్నారని రంగారావు ఆరోపించారు. కాగా, కాంగ్రెస్ బహిరంగ సభను అడ్డుకోవడం అప్రజాస్వామికమని, తెలంగాణ ఏర్పాటుకు సహకరించిన పార్టీకి ఇలాంటి పరిస్థితి రావటం మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో ప్రజాపంథా జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు చంద్ర అరుణ, గుర్రం అచ్చయ్య, కె.అర్జున్‌రావు, సీ.వై.పుల్లయ్య, ఆవుల అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను కొట్టిన హాస్టల్ సిబ్బంది

కామాటిని చితకబాదిన తల్లిదండ్రులు

నేలకొండపల్లి: హాస్టళ్లకు రెగ్యులర్ సంక్షేమాధికారి లేకపోవటంతో సిబ్బందే పెత్తనం చెలాయిస్తుండడం సాధారణమైపోయింది. అయితే, ఇది కాస్త శృతి మించి విద్యార్థులపై చేయి చేసుకునే వరకు వెళ్లగా.. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు సోమవారం చేరుకుని కామాటి(సిబ్బంది)ని చితకబాదారు. వివరాలు... రెగ్యులర్ వార్డెన్ లేకపోవటంతో చెరువుమాధారం ఎస్సీ బాలుర హాస్టల్ బాధ్యతలను నేలకొండపల్లి వార్డెన్ బాలకృష్ణకు అప్పగించారు. ఫలితంగా అక్కడ కామాటి సత్యానందందే పెత్తనం సాగుతుండగా, రెండు రోజుల క్రితం ఆరుగురు విద్యార్థులను వాతలు తేలాలా కొట్టాడు. విషయం తెలుసుకున్న తల్లి దండ్రులు, బంధువులు సోమవారం హాస్టల్‌కు వచ్చి ప్రశ్నిస్తే వారిపైనా మండిపడ్డాడు. దీంతో సర్పంచ్ ఈవూరి సుజాత, ఉప సర్పంచ్ ఆకుల వెంకటేశ్వర్లు, దళిత సంఘాల నాయకులు సూరేపల్లి శ్రీను, సూరేపల్లి రవి చేరుకుని విద్యార్థులతో మాట్లాడగా పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారని, మెనూ అమలుచేయడం లేదని విద్యార్థులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు సత్యానందంపై దాడి చేశాడు. ఈక్రమంలో స్థానికులు అడ్డుకుని తప్పు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప దాడి చేయొద్దని సూచించగా.. ప్రజాప్రతినిధులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అశ్వాపురం: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గిరిజన యువకుడు మృతి చెందాడు. మామిళ్లవాయి గ్రామానికి చెందిన మడివి చోటు(20) తన బైక్‌పై స్వగ్రామం నుంచి మొండికుంట వస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటాపురం గ్రామ శివారులో బైక్ చెట్టును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

దమ్మపేట: భర్తతో మనస్పర్థల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మందలపల్లి గ్రామానికి చెందిన దుర్గాప్రసన్న(26)కు మణుగూరు గ్రామానికి చెందిన తరగాల మహేష్‌తో వివాహం జరిగింది. వారికి కూతురు జన్మించింది. ఆడపిల్ల పుట్టిందనే కారణంగా భర్తతో మనస్పర్థలు రావడంతో దుర్గాప్రసన్న కొంతకాలంగా పుట్టింట్లోనే ఉంటోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది గత నెల 29న ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకున్నాక ఈ నెల 1వ తేదీన డిశ్చార్జ్ చేశారు. సోమవారం బాధితురాలు కడుపులో నొప్పి వస్తుందంటూ పడిపోగా, కుటుంబ సభ్యులు సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్ అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. మృతురాలి తల్లి కోలా ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

వేడి నూనెలో పడి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఇబ్రహీం

పాల్వంచ: ఓ వ్యక్తి లో బీపీతో కళ్లు తిరిగి వేడి నూనె గిన్నెపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. సోమవారం సబ్ స్టేషన్ ఏరియాకు చెందిన కేటీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగి ఎండీ.ఇబ్రహీం తన మనుమరాలికి చిప్స్ కొనివ్వడానికి కేఎస్‌పీ రోడ్‌లో చిప్స్ తయారు చేసి అమ్మే షాపు వద్దకు వచ్చాడు. షాపు ముందే కళాయిలో చిప్స్ తయారు చేస్తుండగా ఆ పక్కనే నిల్చున్న ఇబ్రహీం ఒక్కసారిగా లో బీపీకి గురై కళ్లు తిరిగి కళాయిపై పడ్డాడు. దీంతో వేడి నూనె అతని ఒంటిపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతని మనుమరాలికి స్వల్పగాయాలయ్యాయి. అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

బస్సులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

వైరా: ఒడిశాలోని డంపింగ్ లైన్ ప్రాంతానికి చెందిన చేతన్ గులరీ, గౌరీ జారా సోమవారం ఒడిశా నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్నారు. సమాచారం అందిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరరావు, ఎస్ఐ ముబారక్ అహ్మద్ వైరా బస్టాండ్‌లో తనిఖీ చేశారు. 12.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.